క్లుప్తంగా

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల : పంట సాగు హక్కు పత్రాల వలన కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని, కౌలు రైతులందరూ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే రైతుతో పాటు కౌలు రైతు నష్టపోతారని, దీని నివారించడానికి పంట సాగు హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. కౌలు పత్రం వలన సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ, ధాన్యం పండించిన తర్వాత కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే వీలుంటుందని చెప్పారు. కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకునే రైతులు భూ యజమాని ఆధార్ కార్డు, వన్ బీ, అడంగల్, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, ఫోన్ నంబర్, ఫొటో, కౌలు రైతు ఆధార్ కార్డు తీసుకొని రైతు సేవా కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలను సంప్రదించాలన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ఆదోని రూరల్: రెండో ముంబాయిగా పేరున్న ఆదోనిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశాన్ని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని నేడు వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తే పరిశ్రమలు తరలివచ్చి యువతకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. ఆదోని నుంచి ఇప్పటికే 60 వేల మంది దాకా వలస వెళ్లారని, ఈ వలసల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు వెంకటేష్, సంజీవ్, వసంత్, మల్లి, భాస్కర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దేవేంద్రప్పకు కురువ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

కౌతాళం: కర్నూల్ జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాన్వి దేవేంద్రప్పకు కురవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని జిల్లా కురవ సంఘం సహాయ కార్యదర్శి కౌతాళం మండలం అధ్యక్షుడు కువర వీరేష్ కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురవలను నమ్మి రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే స్థానాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముగ్గురుని గెలిపించి కానుకగా ఇచ్చామన్నారు. మాన్వి దేవేంద్రప్ప పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పోరాడుతున్నాడని తెలిపారు. రెండుసార్లు మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఒకసారి ఎంపీపీగా, ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారని చెప్పారు. సమావేశంలో కురవ సంఘం నాయకులు శివ కుమార్, అనిమేష్, బీరప్ప, దేవేంద్ర, రమేష్, వీరలింగ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి


ఎస్ఐ తిమ్మయ్య

నందవరం : మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ తిమ్మయ్య సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. అల్లరిమూకలు గ్రామంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువాలన్నారు. ప్రశాంతమైన గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకారులకు ఆరోగ్య బీమా కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: దుమ్ము, ధూళికి రోడ్లపై కుల వృత్తిని చేసుకొనే చర్మకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా కల్పించాలని ఏపీ చర్మకారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో చర్మకార వృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారసత్వంగా వచిన వృత్తిని చేసుకునే చర్మకారులకు ప్రభుత్వం ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించి వారికి నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు సుమాల ఆంథోని, భాస్కర్, సుమాల రాజు, గుంటెప్ప, శాంతి తదితరులు పాల్గొన్నారు.

భయపడొద్దు..అండగా ఉంటాం

- వార్డుల అభివృద్ధిపై దృష్టి సారించండి
- కౌన్సిల్‌లో మెజారిటీ వైఎస్సార్‌సీపీదే
- మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీతి నిజాయితీగా వుండి ప్రజల కోసం పనిచేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎవరికీ భయపడవద్దని, అండగా మేముంటామని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అభయమిచ్చారు. అధికార పార్టీ వారు పెట్టే ప్రలోభాలకు లొంగకుండా తమ వార్డుల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉందని, ఏ అభివృద్ధి పని అయినా సమష్టిగా నిర్ణయం తీసుకొని కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి వార్డులు అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కొందరు కౌన్సిలర్లు త మ స్వలాభం కోసం వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి వెళ్లి ఉండవచ్చని, వారి గురించి ఆలోచించవద్దన్నారు. పార్టీ మారిన వారు తరువాత పశ్చాత్తాపపడుతారన్నా రు. నిజాయితీగా వుంటే ఏపార్టీకి భయపడాల్సిన పని లేదని,పార్టీశ్రేణులకు మేము అండగాఉంటామన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

కౌన్సిలర్లంతా ఐక్యంగా వుండి తమ తమ వార్డుల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ సూచించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ కౌన్సిలర్లు తమ పార్టీ వారే ఉన్నందున పట్టణంలో ఏ అభివృద్ధి పని చేసుకోవాలన్నా చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు దృష్టికి తీసుకెళ్లి చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఏవీ సక్రమంగా అమలు చేయలేదని, త్వరలో ప్రజలు ఛీదరించు కునే స్థాయికి రావడం ఖాయమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ ని అమలు చేశారని ఆమలుకు సాధ్యం కాని హామీలి చ్చిన టీడీపీ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

వైఎస్సార్‌సీపీని వీడాల్సిన అవసరం లేదు

తాను కూడా పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు స్పష్టం చేశారు. తనకు వైఎస్సార్‌సీపీని వీడాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు బుట్టా నీలకంఠ, బుట్టా ప్రతూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ కార్యదర్శి వీరేంద్ర, కౌన్సిలర్లు కామర్తి నాగేషప్ప, ఎంకే.శివప్రసాద్, నీలకంఠ, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకె రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో వ్యర్థాలను తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో పేరుకుపోయిన వ్యర్థపదార్థాలను తొలగించాలని రాయలసీమ ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ టీచర్ నాగన్న, విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, సురేంద్ర, ఖాజలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా సంఘాల నాయకులు ఎల్లెల్సీ కాలువలో పేరుకుయిన వ్యర్థాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేయన్నారని, ఆ నీటినే పట్టణ వాసులకు తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారని తెలిపారు. ప్రస్తుతం కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కాలువకు నీరు విడుదలైతే ఆ నీరు కలుషితమయ్యే ప్రమాదం వుందని, తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీరేష్,వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలోని ఎల్లెల్సీ కాలువలో పేరుకొని పోయిన వ్యర్థాలను చూపుతున్న నాయకులు

గ్రామ గ్రామానా పీర్ల పండుగ సందడి

కోసిగి: కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకలు గ్రామ గ్రామానా పీర్ల పండుగ సందడి నెలకొంది. మండల కేంద్రం కోసిగిలోని పెద్ద మజీద్, కుమ్మరి వీధి, నూరాని సున్నీ మజీద్ సమీపంలోని చావిడీలలో పీర్లు కొలువు దీరాయి. భక్తులు పీర్లను దర్శించుకుని పూజలు చేసుకుంటున్నారు. మరికొందరు చక్కెర చదివింపులు చదివిస్తున్నారు. మండలంలోని మూగలదొడ్డి, చిన్నభూంపల్లి, అగసనూరు, వందగల్లు, చింతకుంట, పల్లెపాడు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చావిడీల వద్ద యువకులు, పెద్దలు అలాయి బలాయి ఆడుతూ సంబరాలు జరుపుకుంటున్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలు భక్తులు నిర్వహించారు. మేళతాళలతో పీర్ల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్న సరిగెత్తు సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పీర్ల చావిడీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 15వ తేదీన పగటి సరిగెత్తు, 16వ తేదీన పెద్ద సరిగెత్తు భక్తులు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. 17న పీర్ల జలధి, మొహర్రం నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు.



గోనెగండ్లలో పూజలందుకుంటున్న పీర్ల దేవుళ్లు, అగసనూరు చావిడీలో పూజలందుకుంటున్న పీర్లు

ఘనంగా పీర్ల ఊరేగింపు

కౌతాళం: మొహర్రం వెడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి 7గంటలకు మండల కేంద్రమైన కౌతాళంలో కొలువైన కడ్లేగూడు (సుత్తం దేవర) ఊరేగింపు వైభవంగా సాగింది. స్థానిక కాకీపీర్ వీధి నుంచి గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ముందుగా జామియా మసీదు మీదుగా జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా చేరి ఊరేగింపు కొనసాగించారు. రాత్రి వరకు భక్తుల కొలాహలం మధ్య, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. భక్తులు పీర్ల దేవుళ్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఇమాంఖాశీం (గంటెప్ప దేవర) సరిగెత్తు తెల్లవారు జామున ఉంటుందని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కౌతాళంలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



కౌతాళంలో ఇమాం ఖాశీం పీర్ల చావిడీలో ఫాతెహాల కోసం బారులు తీరిన భక్తులు, మూగలదొడ్డిలో కొలువుతీరిన పీర్లు

జీపీఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్

ఎమ్మిగనూరుటౌన్: జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేయడం సమంజసం కాదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దుపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందని భావిస్తే.. చర్చలే లేకుండా జీపీఎస్‌పై గెజిట్ జారీ చేయడాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. యువగళం పాదయాత్రలో 117 జీఓ రద్దుపై నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, ఎల్లప్ప, నాగరాజు, రామచంద్ర, వెంకటరాముడు, చిన్న తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఆదోని సెంట్రల్: సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. సీపీఎస్ స్థానంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్‌ను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యగ ఆర్థిక బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమములో నాయకులు సూర్యుడు, రామాంజినేయులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

జీపీఎస్ అమలు చేయడానికి తీసుకొచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయమని 20 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వేంటనే సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి ఆ తరువాత విస్మరిస్తున్నారన్నారు. జీవో నంబర్.54 ద్వారా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొని రావడాన్ని యూటీఎఫ్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సభ్యులు మల్లికార్జున, రామాంజినేయులు, నాయకులు నారాయణ, మల్లయ్య, నాగేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: అత్తింటి వేధింపులు తాళలేక కురవ లత అనే వివాహిత ఆదివారం పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రకోట గ్రామానికి చెందిన కురవ గోవిందు, సరస్వతిల కుమార్తెను లతను చెన్నాపురం గ్రామానికి చెందిన బంధువు కురవ విజయ్‌కుమార్‌కు ఇచ్చిన మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. సంతానం కలగలేదని లతను భర్త, అత్త, అవ్వలు వేధించటం మొదలు పెట్టారు. దీంతో మూడు నెలలు ఆమె పుట్టినిల్లు అయిన ఎర్రకోటలోనే ఉండగా.. పెద్ద మనుషులు సమక్షంలో పంచాయితీ చేసి నెల క్రితం చెన్నాపురానికి పంపారు. కొన్ని రోజులు బాగానే ఉండి మళ్లీ వేధించడం మొదలు పెట్టారు. 'నీవు చస్తే మేం మా కుమారుడికి మరో పెళ్లి చేస్తాం' అని అత్త, అవ్వలు వేధించేవారు. ఆదివారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా.. ఎర్రకోటలోని తండ్రి గోవిందుకు ఫోన్ చేసి తాను ఆత్మహత్యచేసుకుంటునానని, మీరు త్వరగా వస్తే చివరి చూపు చూస్తానని ఫోన్ పెట్టేసి ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తండ్రి గోవిందు, కుటుంబ సభ్యులు వెంటనే చెన్నాపురానికి చేరుకొని అపాస్మకస్థితిలో ఉన్న లతను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లత ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపార.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లత

గుండమ్మ హంతకులను శిక్షించాలి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంగుమాల శోభన్‌బాబు

ఆదోనిటౌన్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కి చంపిన కిరాతకులను వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ గంగుమాల శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు పి.వి.సునీల్‌కుమార్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు మృతురాలు గుండమ్మ కుటుంబ సభ్యులు, కుమారుడు కిషోర్, కుమార్తె శృతి, కోడలు ఉషలను పరామర్శించారు. హత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ అండగా నిలుస్తుందని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అంబేడ్కర్ ఇండియా మిషన్ కార్యదర్శి కేశవులు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్, సైనికల్ దళ్ కన్వీనర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం కార్యకర్తలు పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా నాయకులు రామాంజినేయులు, వెంకటేశ్వర్లు, గోవిందు పిలుపునిచ్చారు. పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు రెండవ రోజు కొనసాగాయి. వారు మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేయడం లేదన్నారు. నిత్యావసర ధరలు ఓవైపు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పోతుండటంతో వున్న ఉద్యోగాలు ఊడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఉచిత ఇసుక విధానానికి కట్టుబడి ఉండాలని, ఇసుకపై అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2020లో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సంస్కరణలను నిలిపివేయాలన్నారు. సీపీఎం నాయకులు హనుమంతు, రాముడు, కృష్ణ, లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామాంజినేయులు

ఇసుకను ఉచితంగా అందించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఇసుక విధానం వల్ల ప్రజలకు ఇసుక ఉచితంగా అందించే విధంగా లేదని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంపై ఉన్న గందరగోళాన్ని తొలగించి, ఉచితంగా ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల ముందు ఉచిత ఇసుక పాలసీని తెస్తామని హామీ ఇచ్చాయని, అయితే ప్రభుత్వ విధానంలో ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం కనిపించడం లేదన్నారు. తక్కువ ధరకు ఇసుక అన్నట్లు ఉందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రవి, సుంకన్న, నరసప్ప, నరసింహులు, రంగన్న, రవి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

- హుండీలో నగదు, వెండి అపహరణ


హుండీని పగుల గొట్టిన దృశ్యం

గోనెగండ్ల: పెద్దమరివీడు రోడ్డులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్తులు పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దేవాలయం తలుపులు తెరిచి ఉండడం, హుండీకి రంధ్రం పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించారు. హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదు, అమ్మవారి వెండి ఆభరణాలు అపహరించారని తెలిపారు.ఈ విషయంపై పూజారులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణయ్య సీఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న రాము

ఆదోని అర్బన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఆదివారం పిచ్చికుక్క స్వైర్యవిహారం విహారం చేసింది. ఆరేళ్ల బాలుడు రాముని కరిచి తీవ్ర గాయాలపాలు చేసింది. వెంటనే తండ్రి బాలుడిని ఆదోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. బాలుడి తండ్రి జంబన్న మాట్లాడుతూ.. తమ కాలనీలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టుకోవాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.


పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

గోనెగండ్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పదో తరగతి పూర్తి చేసుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన సంబరాలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనాటి ఉపాధ్యాయులు వెంకటరాముడు, శ్రీనివాసులు, రాఘవరెడ్డి, రాజేశ్వరి, అన్వర్, ఉరుకుందు, రామాంజినేయులు, ఉస్మాన్, అక్బర్‌లతో పాటు ఆ నాటి అటెండర్లు కాశీంవలి, కొలుట్లయ్య హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఎవరికీ ఏ చిన్న కష్టం వచ్చినా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ స్నేహం యొక్క గొప్పతనాన్ని చాటుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అలాగే హాజరైన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బందెనవాజ్, షాషావలి, జాకీర్ హుసేన్, బడేసావలి, షఫీ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.